క్లుప్తంగా

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. యాజ్ఞికులు నర్సింహాచార్యులు వేదమంత్రోచ్ఛరణల మధ్య పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకుడు ఆరుట్ల మాధవమూర్తి మాట్లాడారు. నేడు (మంగళవారం) ధ్వజారోహణం, గరుడముద్దలు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపటి నుంచి మత్స్యగిరి స్వామి ఆలయంలో..



శాయంపేట : రేపు (బుధవారం) నుంచి 7వ తేదీ వరకు మండల కేంద్రంలోని కాకతీయుల కాలం నాటి అతిపురాతనమైన శ్రీ మత్స్యగిరి స్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి తెలిపారు. ఆలయంలో బ్రహ్మోత్సవాల కరపత్రాలను సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తుల కోసం అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి, గ్రామపెద్దలు జిన్న ప్రతాప్‌సేనారెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు సదరం స్లాట్ బుక్ చేసుకోవాలి

శాయంపేట : మండలంలోని దివ్యాంగులు సదరం క్యాంప్‌నకు హాజరయ్యేందుకు ఈనెల 4 నుంచి స్లాట్ బుక్ చేసుకోవాలని ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సదరం క్యాంప్ నిర్వహణ కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రి అధికారులు షెడ్యూల్ విడుదల చేశారని తెలిపారు. అర్హులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ముగ్గురు పేకాటరాయుళ్లపై కేసు

దామెర : పేకాడుతున్న ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ముత్యం రాజేందర్ కథనం ప్రకారం.. మండల కేంద్రం సమీపంలోని వినాయక వైన్స్ పరిసరాల్లో సోమవారం కొందరు పేకాడుతున్నారని సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ఈ క్రమంలో దామెరకు చెందిన నక్క యాకుబ్, దామెర అఖిల్, సంగెం మండలంలోని క్రిష్టానగర్‌కు చెందిన వేల్పుల దేవరాజ్ పేకాడుతూ పోలీసులకు పట్టుపడ్డారు. వారి నుంచి రూ.1370 నగదుతోపాటు పేక ముక్కలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డంపింగ్ యార్డు తొలగించాలి

ఎంజీఎం : వరంగల్ నగరం నడిబొడ్డున జనావాసాల మధ్య పోతన నగర్‌లో ఉన్న డంపింగ్ యార్డును తొలగించాలని కాలనీవాసులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, మేయర్ సుధారాణికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కాలనీవాసులు మాట్లాడారు. పోతననగర్‌లోని డంపింగ్ యార్డు వల్ల ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, మేయర్ సుధారాణి పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే డంపింగ్ యార్డును తొలగించాలని డిమాండ్ చేశారు.

ఆటో డ్రైవర్లకు దుస్తుల పంపిణీ



హసన్‌పర్తి: మే డేను పురస్కరించుకుని హసన్‌పర్తి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఆటో డ్రైవర్లకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండేటి శ్రీధర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మేకల హరిశంకర్, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, నాయకులు తాళ్ల రమేష్, మధుసూదన్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరకాల : జెండా ఎగరేస్తున్న ఏఐటీయూసీ నాయకులు



ఎల్కతుర్తి : భీమదేవరపల్లిలో..



కమలాపూర్ : జెండా ఎగరేస్తున్న హమాలీలు

కదం తొక్కిన కార్మికలోకం



ధర్మసాగర్ : వేలేరులో..



ఐనవోలులో..



శాయంపేటలో..



దామెర : ఊరుగొండలో..



ఆత్మకూరులో..

● ఊరూరా మేడే వేడుకలు

పరకాల : మేడే సందర్భంగా ఊరూరా కార్మికలోకం కదంతొక్కింది. పట్టణంలో సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు ఎర్రజెండా ఎగరేసి మాట్లాడారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు దొగ్గెల తిరుపతి జెండా ఆవిష్కరించి మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ ఆవరణలో బీఆర్టీయూ పరకాల డివిజన్ అధ్యక్షుడు లంకదాసరి అశోక్ ఆధ్వర్యంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు కూతురు ప్రతాప్‌రెడ్డి హాజరై జెండా ఆవిష్కరించారు. మార్కెట్ చౌరస్తా వద్ద మేడే వేడుకలకు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను హాజరై జెండా ఆవిష్కరించగా మున్సిపల్ వైస్ చైర్మన్ విజయ్‌పాల్‌రెడ్డి, దళితబంధు కన్వీనర్ రామకృష్ణ, మార్కెట్ చైర్మన్ సారంగపాణి, డైరెక్టర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాలతోపాటు దండేపల్లి, గోపాల్‌పూర్, కేశవాపూర్, జగన్నాథ్‌పూర్, సూరారం, దామెర గ్రామాల్లోని బస్టాండ్ కూడళ్లలో సీపీఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో ఎర్రజెండా ఎగరేశారు. పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ (పీపీఐడీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డ రఘు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు అదారి శ్రీనివాస్, మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ : ధర్మసాగర్, వేలేరు మండలాల్లో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆ పార్టీల నాయకులు జెండాలను ఆవిష్కరించారు. ధర్మసాగర్‌లో సీపీఐ నాయకులు కొట్టె ప్రభాకర్, బట్టు మల్లయ్య, చిలుక బాబు, కర్ర రాజిరెడ్డి, చిలుక దేవదాసు, కొమురయ్య, వేలేరులో సీపీఎం నాయకులు వేల్పుల రవి, నరహరి భిక్షపతి, నాగరాజు, మోహన్‌రావు, లింగన్న, వేలేరు మండల కేంద్రంలో సర్పంచ్ కాయిత మాధవరెడ్డి, ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, తాపీ మేస్త్రీ సంఘం అధ్యక్షుడు కోడూరి కరుణాకర్, హమాలీ సంఘం అధ్యక్షుడు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కరుణాపురంలో..

మండలంలోని కరుణాపురంలో పారిశుద్ధ్య కార్మికులను బీఆర్ఎస్ మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు సుమన్ సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ కలకోటి అనిల్, బీఆర్ఎస్ యూత్ గ్రామ అధ్యక్షుడు, నియోజకవర్గ సోషల్ మీడియా నాయకుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : మండలంలోని అన్ని గ్రామాల్లో మే డే పతాకాలు రెపరెపలాడాయి. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి నకీర్త ఓదెలు మాట్లాడారు. కార్యక్రమాల్లో సీపీఐ నాయకులు, హమాలీ, రిక్షా, జీపు, ఆటో, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్, ముల్కలగూడెం గ్రామాల్లో ఏఐకేఎస్ ఆధ్వర్యంలో మేడే జెండాను ఆవిష్కరించారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ముల్కలగూడెం సర్పంచ్ బండి పర్వతాలు మాట్లాడారు. కొండపర్తిలో సర్పంచ్ రాజమణి జెండా ఆవిష్కరించగా జిల్లా కమిటీ సభ్యులు మడిగె నాగరాజు, కొంకాల నారాయణరెడ్డి, గోపాల్‌రావు, మహేందర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని బస్టాండ్ జంక్షన్‌లో సీపీఎం మండల ఇన్‌చార్జ్ మంద సురేష్ ఎర్రజెండా ఎగరేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దొగ్గెల తిరుపతి హాజరై మాట్లాడగా నాయకులు నక్కరాజు, సతీష్, మొగిలి, అనిల్, రాజు, కుమార్, రమేష్ పాల్గొన్నారు. ప్రగతి సింగారంలో ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి తిరుపతి ఎర్రజెండా ఎగరేయగా నాయకులు బుచ్చయ్య, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. శాయంపేట చేనేత సొసైటీ వద్ద వివిధ సంఘాల ఆధ్వర్యంలో జెండా ఎగరేశారు.

కార్మికులకు పండ్ల పంపిణీ

ఐఎన్‌టీయూసీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల కమిటీ అధ్యక్షుడు మారపల్లి రాజేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిందం రవి, రఫీ, చింతల రవిపాల్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు భోజన ప్యాకెట్ల పంపిణీ

శాయంపేటలోని అనాథ వృద్ధులకు ప్రపంచ మానవ హక్కుల సంఘం జిల్లా వర్కింగ్ చైర్మన్ పాడిశెట్టి కృష్ణమూర్తి భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ చైర్మన్ పోడిశెట్టి గణేష్, జనరల్ సెక్రటరీ మేరగుర్తి కరుణాకర్, ములుగు జిల్లా డైరెక్టర్ రాజేష్, మండల చైర్మన్ బత్తుల కార్తీక్ పాల్గొన్నారు.

దామెర : మండలంలోని ఊరుగొండలో వైస్ ఎంపీపీ జాకిర్ అలీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆటోడ్రైవర్లను, తాపీ మేస్త్రీలను, పెయింటర్లను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజు, ఉపసర్పంచ్ విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో..

ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బండారి చిరంజీవి, నాయకులు గోనెల గోపాల్, బైకని సంపత్, జయశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు మేడే జెండా ఆవిష్కరించారు. గూడెప్పాడ్‌లో న్యూ భగత్‌సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పతాకావిష్కరణ చేయగా కార్యక్రమంలో మాజీ మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు బాబుమియా, పంచాయతీ కార్మికులు ఉప్పుల రవి, నరేష్, సదానందం, ఆటోడ్రైవర్ల సంఘం నాయకులు రాజయ్య, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే బాలల పరిరక్షణ



మాట్లాడుతున్న ఎంపీపీ తడక రాణి

కమలాపూర్ : అవగాహన కల్పించడం ద్వారానే బాలల పరిరక్షణ సాధ్యమని బాలల సంరక్షణ మండల కమిటీ చైర్మన్, ఎంపీపీ తడక రాణి స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బాలల పరిరక్షణ మండల కమిటీ ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ రాణి మాట్లాడారు. పిల్లల్లో బాల్యం నుంచే వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేసేలా తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. కమిటీలు ఎంత చురుగ్గా ఉంటే బాలల జీవితం అంత మెరుగ్గా ఉంటుందన్నారు. బాలల రక్షణ, సంరక్షణలో సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించాలని చెప్పారు. సేఫ్ టచ్, అన్‌సేఫ్ టచ్‌పై పిల్లలకు అవగాహన కల్పించాలని తల్లిదండ్రులకు తెలిపారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు కె.దామోదర్ మాట్లాడుతూ పిల్లలను మంచి వాతావరణంలో పెంచాలన్నారు. తల్లిదండ్రులు ఆర్థిక, సామాజిక, మానసిక సమస్యలను అధిగమించి పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని కోరారు. ఎంపీడీఓ పల్లవి మాట్లాడుతూ కమిటీ ఆధ్వర్యంలో బాలల సమస్యలు గుర్తించి వాటి పరిష్కారం కోసం మండల స్థాయిలో ప్రత్యేక బాలల సభ నిర్వహిస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులకు బాల్యవివాహాలు, నిరోధక చట్టం, వివాహ నమోదు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. ఇన్‌స్పెక్టర్ సంజీవ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న బాలల తక్షణ పునరావాసం కోసం చైల్డ్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098కు, 100కు డయల్ చేయాలన్నారు. వైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణను సామాజిక బాధ్యతగా అభివర్ణించారు. అనంతరం బాలల పరిరక్షణ కమిటీ కరదీపికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.శిరీష, బాలల పరిరక్షణ అధికారి ప్రవీణ్‌కుమార్, బాలరక్షా భవన్ కోఆర్డినేటర్ కె.శిరీష, ఐసీపీఎస్ సోషల్ వర్కర్ సునీత, చైల్డ్‌లైన్ టీం సభ్యులు రవి, కృష్ణ, జ్ఞానేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు పద్మకుమారి, పూర్ణిమ, శ్రీలత, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ధర్మసాగర్ : నాటి ఉపాధ్యాయులతో..



ఆత్మకూరులో..



కమలాపూర్‌లో..

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో 2002–03 విద్యాసంవత్సరంలో టెన్త్ చదువుకున్న విద్యార్థినులు ఆదివారం ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి విద్యార్థిని కొట్టె అర్పిత ఆహ్వానం మేరకు ఆమెతోపాటు పదో తరగతి చదివిన విద్యార్థినులు కలుసుకుని సందడి చేశారు. నాటి ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. నాటి విద్యార్థినులు ఇమ్మడి లోహిత రాజు కార్పొరేటర్‌గా, కొట్టె అర్పిత సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా రాణిస్తున్నందుకు వారిని నాటి విద్యార్థినులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు. నాటి విద్యార్థినులు నాటి ఉపాధ్యాయులైన సత్య, సుజాత, తారాబాయిలను సన్మానించారు. కార్యక్రమంలో నాటి విద్యార్థినులు కార్తీక, శ్రీసుధ, తిరుమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో..

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1988–89 నాటి టెన్త్ బ్యాచ్ విద్యార్థులు చెన్నకేశవస్వామి ఆలయం ప్రాంగణంలో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదువు చెప్పిన గురువులు కృష్ణారెడ్డి, సదానందం, సతీష్, కరుణాకర్‌రావులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ మంగ రాజన్న, కోకన్వీనర్లు జల్లారపు రామస్వామి, డాక్టర్ పావుశెట్టి శ్రీధర్, పోతరాజు రాజు, పెరుమాండ్ల వెంకట్, వెంకటస్వామి, సంతోష్, రాజేందర్, మంజుల, శ్రీదేవి, రమ, అస్మత్‌బేగం, శ్రీలత పాల్గొన్నారు.

ఉప్పల్ జెడ్పీ హైస్కూల్‌లో..

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో 1997–98 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాతికేళ్ల తర్వాత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుని చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. చిన్ననాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంచర్ పనులు నిలిపేయాలి

● బీజేపీ నేత సురేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి

ఎల్కతుర్తి : మండలంలోని ముల్కనూర్ ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న వెంచర్‌ను గ్రామాల సరిహద్దులు తేలేవరకు నిలిపేయాలని బీజేపీ హుస్నాబాద్ నియోజకవర్గ నేత జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సదరు వివాదాస్పద వెంచర్ స్థలాన్ని ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన సోమవారం సందర్శించి పరిశీలించి మాట్లాడారు. కొందరు అధికార పార్టీ నాయకులు స్వార్థం కోసం చింతలపల్లి గ్రామ సరిహద్దులో ఉన్న వెంచర్‌కు ఎల్కతుర్తి గ్రామ పంచాయతీ నుంచి అక్రమంగా అనుమతి తీసుకొని చింతలపల్లి గ్రామ పంచాయతీకి రావాల్సిన ఆదాయానికి గండికొడుతున్నారని ధ్వజమెత్తారు. వెంచర్‌ను ఆనుకున్న ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాకు గురి కాకుండా హద్దులు ఏర్పాటు చేయాలని, అనుమతి ఇచ్చే విషయంలో అక్రమాలకు పాల్పడ్డ సంబంధిత అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వెంచర్ నిర్మాణ పనులను అడ్డుకుని సంబంధిత ప్రభుత్వ కార్యాలయం ఎదుట దీక్ష చేపడతామని హెచ్చరించారు. సమస్యపై జిల్లా కలెక్టర్‌కు, సంబంధిత శాఖల జిల్లాస్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుకినె గిరిజ సుధాకర్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి, నాయకులు జనగాని కిష్టయ్య, అల్లి కుమార్, ఇరువాల గణపతి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు కోచింగ్ సెంటర్ ప్రారంభం



మాట్లాడుతున్న ఫ్యాకల్టీ మెంబర్ రాజు

ధర్మసాగర్ (వేలేరు) : అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్టాపన, ఉత్సవ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో 2023–24 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదవనున్న విద్యార్థులకు మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్‌ను సర్పంచ్ కాయిత మాధవరెడ్డి, ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ ముఖ్యఅతిథులుగా పాల్గొని సోమవారం ప్రారంభించారు. అనంతరం మాధవరెడ్డి, సద్దాం హుస్సేన్ మాట్లాడారు. 2011 నుంచి వేలేరు అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ సెంటర్ నడిపిస్తున్నారని అభినందించారు. విద్యార్థులు కోచింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత కోచింగ్‌కు అయ్యే ఖర్చులు తాను భరిస్తానని ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు, ఫ్యాకల్టీ మెంబర్లు బొల్లం రాజు, మొగిలిచర్ల శ్రీనివాస్, జిల్లెల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం



పరకాల : వెల్లంపల్లిలో దెబ్బతిన్న మిర్చి



కమలాపూర్ : తడిసి కొట్టుకుపోయిన ధాన్యం



శాయంపేట : వరి మెదళ్లను చూపిస్తున్న రైతులు

పరకాల : ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలో చేతికొచ్చిన వేలాది ఎకరాల పంటలు దెబ్బతిన్నాయి. రేపో మాపో వరికోత చేపడుదామనుకున్న వరి పంట నీటమునిగిపోగా మిర్చి రాలిపోయింది. మక్కజొన్న చేలు నేలవాలాయి. రైతులకు పెట్టుబడి కూడా గిట్టుబాటు కాని దుస్థితి నెలకొంది. ఓవైపు పొలాల వద్ద పరిస్థితి ఇలా ఉండగా ధాన్యం ఆరబోసిన కల్లాలు జలమయమయ్యాయి. మండలంలోని వెల్లంపల్లి, నాగారం, వెంకటరాపూర్, లక్ష్మీపూర్, అలియాబాద్, మల్లక్‌పేట, సీతారాంపూర్, రాజిపేటలో పంటలకు నష్టం వాటిల్లింది.

కమలాపూర్ : వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు మండలవ్యాప్తంగా వరి, మొక్కజొన్న, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాలకు విక్రయానికి తీసుకొచ్చిన వరి ధాన్యం తడిచి కొట్టుకుపోగా, వందలాది ఎకరాల్లో వరి పంటలు నేలవాలి నీట మునిగి మొలకలు వస్తున్నాయి. మండల వ్యాప్తంగా 92.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

శాయంపేట : మండలంలో ఆదివారం రాత్రి ఎడతెరిపి లేకుండా వర్షం దంచికొట్టింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు ఆదివారం నాటి భారీ వర్షానికి వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. వరి ధాన్యం తడిచింది. పంట చేతికి అందివస్తున్న తరుణంలో అకాల వర్షాలతో పంట చేలు నీటితో నిండిపోయి వరి పంటలు మురిగిపోతున్న దుస్థితి నెలకొంది. కొన్ని చోట్ల కోత వేసిన మక్కలు నీటిలో తడిచి నల్లబడిపోయి ఫంగస్ సోకుతున్న పరిస్థితి కనపడుతోంది. ఇదే అదునుగా తడిచిన వరి ధాన్యాన్ని, మక్కలను ప్రైవేట్ వ్యాపారస్తులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు.

నీటితో నిండిన పంట చేలు

మండలంలో కొద్ది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు పంట చేలు నీటితో నిండిపోయాయి. వరి క్షేత్రాలు గొలుసులు రాలిపోయి నేలవాలిపోయాయి. ఆరుగాలం శ్రమించి అప్పు తెచ్చి పంటలు పండించగా మరో వారం రోజుల్లో పంట కోతకు వస్తుందనుకున్న తరుణంలో అకాల వర్షాలు కురిసి పంటలు పూర్తిగా ధ్వంసం అయ్యాయని రైతులు చల్లా రాజ్‌కుమార్, వైద్యుల వెంకటరాజిరెడ్డి, పోతురెడ్డి రాజిరెడ్డి, తలబోయిన సుమన్ విలేకరుల ఎదుట వాపోయారు. తొమ్మిదెకరాల్లో తాను వరి సాగు చేయగా ఎకరాకు రూ.60 వేల ఖర్చు రాగా మరో వారం రోజుల్లో పంట కోసేందుకు సిద్ధం కాగా అకాల వర్షాలతో చేలల్లో నీటితో నిండిపోయి పంట నష్టం వాటిల్లిందని రైతు రాజ్‌కుమార్ తెలిపారు. పెద్దకోడెపాకలో మక్కలు చేలల్లో ఆరబెట్టగా వర్షాలకు తడిచి గింజలకు ఫంగస్ సోకిందని రైతు సవాసి రమేష్ తెలిపారు.

ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలి

అకాల వర్షాలతో తడిచిన వరి, మక్కలను ప్రభుత్వమే మార్క్‌ఫెడ్, కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రైవేట్ వ్యాపారులు తడిచిన ధాన్యానికి, మక్కలకు అతి తక్కువ ధర చెల్లిస్తూ రైతును దోచుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వ్యవసాయ అధికారులతో సమగ్ర సర్వే చేయించి బాధిత రైతులకు పరిహారం చెల్లించడంతోపాటు తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న శ్రీరాం భూపాల్

ఐనవోలు : ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి బాధిత రైతులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు అర్షనపల్లి శ్రీరాం భూపాల్ డిమాండ్ చేశారు. మండలంలోని పంథినిలోని కల్లాలను ఆయన సందర్శించి పంటనష్టాన్ని పరిశీలించి మాట్లాడారు. గర్మిళ్లపెల్లిలో ఎంపీటీసీ బీరం మౌనిక దేవేందర్‌రెడ్డి ధాన్యం కొనుగోలు సెంటర్ వద్దకు వెళ్లి రైతులకు ధైర్యం చెప్పారు. అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ కలకోట ఎలేంద్ర, నాయకులు జంపయ్య, రాజు, ఎల్లగౌడ్, భిక్షపతి, ఎండీ రషీద్, అనిల్, రాము, మురళి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా

హసన్‌పర్తి: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల వైద్యానికి భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మడిపల్లికి చెందిన చిర్ర జ్యోతి అనారోగ్యంతో బాధపడున్న చికిత్స నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే సోమవారం అందించి మాట్లాడారు. అర్హులందరినీ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంచూరి విజయ్, ఇంద్రయ్య, రాజు, రంజిత్ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కళ్యాణ్, నాయకులు

నడికూడ : అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి లక్ష రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని సీపీఎం పరకాల పట్టణ కమిటీ ఇన్‌చార్జ్ బొచ్చు కళ్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నర్సక్కపల్లె గ్రామంలో ఇటీవల వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను ఆయన ఆధ్వర్యంలోని బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడారు. వడగండ్ల వానతో మండలంలోని మొక్కజొన్న, వరి పొలాలు భారీగా దెబ్బతిన్నాయని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవసాయ శాఖ అధికారులు సమగ్ర సర్వే చేయించి బాధిత రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బొచ్చు అఖిల్, సాయి, సిద్ధు, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఆత్మకూరు : మండల కేంద్రానికి చెందిన జన్ను రమ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకుడు పెరుమాండ్ల భిక్షపతి సోమవారం పరామర్శించి ఓదార్చారు. అలాగే రూ.11 వేల ఆర్థికసాయం అందించారు. అగ్రంపహాడ్ సర్పంచ్ మాదాసి అన్నపూర్ణ, బీఆర్ఎస్ నాయకుడు దయ్యాల రమేష్ బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాదాసి రాజు, మంద రవి, జన్నారపు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.